ప్రజాశక్తి
ఆదివారం 24 సెప్టెంబర్ 2023
5
విజయనగరం

పట్టాలు తప్పిన గూడ్స్

ప్రజాశక్తి-విజయనగరం కోట

శృంగవరపుకోట మండలం బొడ్డవర రైల్వే స్టేషన్ సమీపంలో గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. శనివారం విశాఖపట్నం నుంచి కిరం డోలు వెళ్తున్న గూడ్సు బొడ్డవర రైల్వే స్టేషన్ దాటిన తర్వాత ఇంజిన్ పట్టాలు తప్పింది. సమాచారం అందుకున్న సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని మరమత్తులు చేపట్టి ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేశారు.

రైలు ఇంజిన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

రోల్ మోడల్‌గా నిలవాలి

- ఉపాధ్యాయులకు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ సూచన
- వర్కుబుక్స్ రాయించకపోవడం, అకడమిక్ మోనటరింగ్‌పై ఆగ్రహం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్, డెంకాడ

ఉపాధ్యాయులు విద్యార్థులను ఆదర్శంగా తీర్చిదిద్ది రోల్‌మోడల్‌గా నిలవాలని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ సూచించారు. విద్యార్థులతో సరిగా వర్కుబుక్స్ రాయించకపోవడం, ఉపాధ్యాయులు సరిగా కరెక్షన్ చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం విజయనగరంలోని కస్పా హైస్కూల్, ఆర్‌కె ప్రాథమిక పాఠశాల, 15వ నెంబరు సచివాలయం, డెంకాడ మండలం మోపాడ కెజిబివి పాఠశాలను పరిశీలించారు. పర్యటనంతా ఉపాధ్యాయులను హెచ్చరిస్తూ సాగింది. బోధనపైనా, విద్యార్థులకు అందుతున్న విద్యపైనా ఏ విధంగా పర్యవేక్షణ చేస్తున్నారో తెలుసుకోవాలని అధికారులకు సూచించారు.

తొలుత కస్పా హైస్కూలుకు చేరుకున్న ప్రవీణ్ ప్రకాష్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం 7వ తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థుల అకడమిక్ స్థాయిని, వర్కుబుక్స్‌ను పరిశీలించారు. విద్యార్థులు సరిగ్గా రాయకపోవడం, ఉపాధ్యాయులు వర్క్‌బుక్స్ కరెక్షన్స్ సరిగ్గా చేయకపోవడంపై ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇస్తున్న జీతానికి అయినా పని చెయ్యాలి కదా అంటూ లెక్కలు, సైన్స్ ఉపాధ్యాయులను హెచ్చరించారు. మోనటరింగ్ చేయాల్సిన బాధ్యత లేదా అంటూ ఆర్‌జెడిని, డిఇఒ, డిప్యూటీ డిఇఒ, ఎంఇఒ, హెచ్‌ఎంలను ప్రశ్నించారు. మీపై చర్యలు తీసుకుంటే తప్పేంటని అన్నారు. విద్యార్థులకు రోల్ మోడల్ గా ఉండాల్సిన ఉపాధ్యాయులు ఇలాగే ఉంటారా అని అన్నారు. మొత్తం స్కూల్లో ఉన్న 62 మంది ఉపాధ్యాయుల పని తీరు, అకడమిక్ మానిటరింగ్‌పై రివిజన్ చేయాలని ఆర్‌జెడి, డిఇఒలను ఆదేశించారు. 38మంది విద్యార్థుల వద్ద వర్క్ బుక్స్ వసూలు చేసి వాటిని కరెక్షన్ చేసి ఇవ్వాలని విద్యా శాఖ అధికారులను ఆదేశించారు.

ఆర్‌కె ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు భోజనం తినిపిస్తున్న ప్రవీణ ప్రకాష్

డెంకాడ : మోపాడ కెజిబివిలో విద్యార్థులతో ఫొటో దిగిన ప్రవీణ్ ప్రకాష్

అనంతరం విద్యార్థులు మధ్యాహ్న భోజనాలు చేస్తున్న సమయంలో అర్ కె మున్సిపల్ ప్రాథమిక పాఠశాలకు చేరుకున్నారు. విద్యార్థులకు భోజనాలు వడ్డించి, ఇద్దరు విద్యార్థినులకు తినిపించారు. అనంతరం పాఠశాల ఆవరణంలో ఉన్న వాటర్ ప్లాంట్‌ను పరిశీలించారు. ఉపాధ్యాయులను పిలిచి మీరు ఈ నీరే తాగుతున్నారా లేక ఇంటి నుంచి తెచ్చుకుంటున్నారా అని అడగ్గా కొంత మంది తెచ్చుకుంటున్నామని , మరి కొందరు ఇక్కడ నీరు తాగుతున్నామని చెప్పారు.దీంతో అందరి ఉపాధ్యాయులతో వాటర్ ప్లాంట్ నీటిని తాగించారు. అనంతరం 4 వ తరగతి తరగతి గదిలోకి వెళ్ళి సైన్స్, ఇంగ్లీష్ వర్క్ బుక్స్ పరిశీలించారు. అక్కడ కూడా వర్క్ బుక్స్ పరిశీలన సరిగ్గా చేయకపోవడంతో ఉపాధ్యాయులపై మండి పడ్డారు.

తొలుత సైన్స్ ఉపాధ్యాయరాలిని సబ్జెక్ట్ గురించి అడగ్గా, తాను సర్ఫస్ టీచర్ గా ఇక్కడ విధులు నిర్వహిస్తు న్నాని చెప్పడంతో, సర్ప్లస్ టీచర్ ని ఇంకొక దగ్గర ఉపయోగించుకోవచ్చు కదా, చాలా వార్డెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి అక్కడ విధులు నిర్వర్తించే అవకాశం ఉంటుంది కదా అని ఎంఇఒను ప్రశ్నించారు. 7 ఏళ్ల సీనియారిటీ ఉన్న ఎంఇఒ దీనిపై దష్టి పెట్టకపోడం ఏమిటని, ఇలా అయితే ఎంఇఒను ఎందుకు సస్పెండ్ చేయకూడదని ఆర్‌జెడిని ప్రశ్నించారు.

వాలంటీర్లకు ముచ్చెమటలు

ఇప్పిలి వీధిలో గల సచివాలయాన్ని పరిశీలించి ఉద్యోగులందరినీ బయటకు రప్పించి, వీధిలో రోడ్డు మీద మాట్లాడారు. వాలంటీర్లు ఒక్కొక్కరిని పిలిచి మీ పరిధిలో ఎన్ని ఇల్లు ఉన్నాయి,వాటిలో ఎంత మంది చదువుతున్నారు, ఎంత మంది చదువు మానేశారు వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాలంటీర్లకు కార్పొరేషన్ కమిషనర్‌ను చూపించి ఆయన ఎవరు అని అడిగితే ఒక వాలంటీర్ తెలియదని సమాధానం ఇచ్చారు, కమిషనర్ పేరు వాలంటీర్లకు తెలియకపోతే ఏమి పని చేస్తున్నారని ప్రశ్నించారు. కళాశాల మానేసిన విద్యార్థికి వాలంటీర్ ద్వారా ఫోన్ చేసి మాట్లాడారు. ఆ విద్యార్థి ఓ ఫర్నీచర్ షాపులో పనిచేస్తున్నాడని తెలుసుకొని అతని ఇంటికి వెళ్లి ఓపెన్ ఇంటర్‌లో అడ్మిషన్ చేయించారు.

మోపాడ కెజిబివి పరిశీలన

డెంకాడ మండలం మోపాడ లోని కెజిబివిని ప్రవీణ్ ప్రకాష్ పరిశీలించారు. తొమ్మిదో తరగతి విద్యార్థుల సోషల్ నోట్ పుస్తకాలను పరిశీలించారు. వాటిని కరెక్షన్ చూసి తప్పులు లేకపోవడంతో విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థులతో ఇంగ్లీష్ పాఠాలను చదివించారు అనంతరం పాఠశాలలో ఉన్న స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. నాడు- నేడులో జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం మోపాడ సచివాలయాన్ని సందర్శించి వందశాతం జిఇర్ సర్వే పూర్తిచేసిన వాలంటీర్లను అభినందించారు. ఆయన వెంట ట్రైనీ కలెక్టర్ వెంకట త్రివి నాగ్, ఆర్‌జెడి జ్యోతి కుమారి, డిఇఒ లింగేశ్వర రెడ్డి, డిప్యూటీ డిఇఒ వాసుదేవరావు, ఎంఇఒ రామచంద్ర రాజు, కార్పొరేషన్ కమిషనర్ శ్రీరాములు నాయుడు, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, డెంకాడ ఎంఇఒలు వెంకటరమణ, రాధాకృష్ణ ఉన్నారు.

యుటిఎఫ్ జెండా ఎగురవేసి, పోస్టర్ ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

యుటిఎఫ్ ఉద్యమ స్ఫూర్తిని

భవిష్యత్తు తరాలకు అందించాలి

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్
- స్వర్ణోత్సవ సంబరాలు జయప్రదం చేయాలని పిలుపు

ప్రజాశక్తి - జామి

ఉపాధ్యాయులంటేనే సమాజంలో భాగమని, ఐదు దశాబ్దాలుగా ఉపాధ్యాయ ఉద్యమంతో ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకోవడంతో పాటు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి, హక్కుల సాధనకు పాటుపడుతున్న యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలను జయ ప్రదం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ పిలుపు నిచ్చారు. 1974 ఆగస్టు 10న ఆవిర్భవించిన యుటిఎఫ్ 50 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఇచ్ఛాపురంలో ప్రారంభమైన జాతా శనివారం జామి మండలానికి చేరుకుంది. ఈ సందర్భంగా జామి బస్టాండ్‌లో యుటిఎఫ్ జెండా ను సీనియర్ నాయకులు గూనూరు వెంకటరావు ఆవిష్కరించారు. అనంతరం కెఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ, యుటిఎఫ్ ఉద్యమ స్ఫూర్తిని భవిష్యత్తు తరాలకు అందించేందుకు, విద్యారంగాన్ని కాపాడుకోవాలన్న ఉద్దేశ్యంతో స్వర్ణోత్సవాలను అక్టోబర్ 1 న విజయవాడలో నిర్వహిస్తున్నామని,పెద్దఎత్తున ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని పిలునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలు సృష్టించినా, వెరవకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక విధానాలపై యుటిఎఫ్ పోరాడుతుందని గుర్తు చేశారు. ప్రభుత్వ రంగ విద్య ప్రజలకు మిగిల్చే విధంగా ఉద్యమం సాగిస్తోందని తెలియజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్‌జిల్లా ప్రధాన కార్యదర్శి జెవిఆర్‌కె ఈశ్వరావు, నాయకులు జిల్లా నాయకులు రెడ్డి మోహన్, తాతంనాయుడు, కె.సూర్య నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫ్యాప్టో నిరసన

బొబ్బిలి రూరల్ : జిపిఎస్‌ను రద్దుచేసి ఒపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యాన స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఎస్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగారావు,యుటిఎఫ్ నాయకులు విజయగౌరి, ఆప్టా నాయకులు గణపతిరావు, ఎపిటిఎఫ్ నాయకులు జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఒపిఎస్ అమలుకు 25న చలో కలెక్టరేట్

ఫ్యాప్టో, ఎపిసిపిఎస్ఇఎ పిలుపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వం తీసుకొచ్చిన జిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను మాత్రమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25న చలో జిల్లా కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహిస్తామని ఫ్యాప్టో, ఎపిసిపిఎస్ ఎంప్లాయిస్ సంఘాలు పిలుపునిచ్చాయి. శనివారం స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయా సంఘాల నాయకులు మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సిపిఎస్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చిన జగన్ నాలుగేళ్ల అధికారం తరువాత జిపిఎస్ తీసుకొచ్చి ఉపాధ్యాయులను, ఉద్యోగులను మోసం చేశారని అన్నారు. జిపిఎస్ విధానాన్ని ఉపాధ్యాయ. ఉద్యోగ వర్గాలు వ్యతిరేకిస్తూ ఉన్నా బలవంతంగా ప్రభుత్వం ప్రతిపాదించడం,. క్యాబినెట్ అంగీకారం తెలుపడం అందరినీ మోసం చేయడమేనని అన్నారు. ఈనేపథ్యంలో తలపెట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఫ్యాప్టో నాయకులు జె. రమేష్ చంద్ర పట్నాయక్, జెవిఆర్‌కె ఈశ్వరరావు, పాత్రేరు శ్రీనివాసరావు, వి. రమణ, ఎపిసిపిఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు ఆర్. శివకుమార్, కె. భీమంజయ పట్నాయక్, జి. శ్రీనివాసరావు, ఎస్.అప్పలనాయుడు, జి.త్రినాధ్ పాల్గొన్నారు. కార్యక్రమానికి పిఆర్‌టి నాయకులు సంఘీభావం తెలిపారు.

డ్రైవింగ్ స్కూల్స్‌కు నోటీసులు : డిటిసి

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో ఉన్న అన్ని డ్రైవింగ్ స్కూల్స్‌కు నోటీసులు జారీ చేసినట్లు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ జిఆర్ రవీంద్రనాథ్ తెలిపారు. శనివారం తనను కలిసి ప్రజాశక్తితో మాట్లాడారు. జారీ చేసిన నోటీసుల ప్రకారం ఈ నెలాఖరులోగా ఆయా డ్రైవింగ్ స్కూల్స్‌లో నాన్ ట్రాన్స్‌పోర్టుగా తిప్పుతున్న వాహనాలను ట్రాన్స్‌పోర్టు వెహికల్స్‌గా మార్చుకోవాలని తెలిపారు. ప్రతి వెహికల్ పైన కచ్చితంగా ఆయా డ్రైవింగ్ స్కూల్స్ పేరు కచ్చితంగా పెట్టుకోవాలన్నారు. ఈ నోటీసులకు వారం రోజుల్లోగా కచ్చితంగా సమాధానం చెప్పాలని, లేదంటే డ్రైవింగ్ స్కూల్స్ లైసెన్సులను చెక్ చేసి రద్దుచేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. డ్రైవింగ్ స్కూల్స్ లైసెన్స్‌లు కూడా కచ్చితంగా పాటించాలని, లేదంటే వాటిని సీజ్ చేస్తామని తెలిపారు. విజయనగరం జిల్లా పరిధిలో 15స్కూల్స్‌కు గాను విజయనగరంలో 9, విజయనగరం మండల పరిధిలో చెల్లూరులో ఒకటి, బొబ్బిలిలో మూడు, నెల్లిమర్ల ఒకటి, గంట్యాడలో ఒకటి ఉన్నాయని తెలిపారు. ఆయనతో పాటు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎవి రమణ ఉన్నారు.

అమ్మవారి పండగకు విస్తృత ఏర్పాట్లు

ప్రజాశక్తి-విజయనగరం

పైడితల్లి అమ్మవారి సిరిమాను పండుగకు విస్తత ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. జిల్లా ఎస్‌పి దీపికతో కలిసి కలెక్టర్ శనివారం పైడితల్లి అమ్మవారి ఆలయాన్ని, పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. భక్తుల రాకపోకలు, విఐపిల దర్శన ఏర్పాట్లుపై ఆలయ అధికారులతో చర్చించారు. అమ్మవారి ఆలయం ప్రక్కనున్న కట్టడాలను త్వరగా తొలగించి చదును చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ, అమ్మవారి పండుగకు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. సామాన్య భక్తులకు సైతం సంతృప్తికరమైన దర్శనం జరిగే విధంగా ప్రణాళికను రూపొందిస్తామని అన్నారు. దీనికోసం వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, సంస్థల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ఎవరికీ ఎటువంటి ఇబ్బంది కలగకుండా పండుగను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి

పర్యటనలో ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, మున్సిపల్ కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు, డిఎస్‌పి ఆర్.గోవిందరావు, తాహశీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, ఆలయ ఇఒ సుధారాణి, ప్రధాన పూజారి బంటుపల్లి వెంకటరావు, ఇతర ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో చైర్మన్ పృథ్వీరాజ్ తనిఖీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో గృహ విద్యుత్ మీటర్లను ఎపిఇపిడిసిఎల్ చైర్మన్, మేనేజింగ్ డెరెక్టర్ ఐ.పృథ్వితేజ్ శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నగరంలోని డక్కినవీధి, చిన్న వీధి, బొడ్డువారి జంక్షన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ మీటర్లను తనిఖీ చేశారు. విద్యుత్ వినియోగంలేని గృహాలకు మీటర్లు ఉన్నాయా? వీటికి విద్యుత్ సరఫరా నిలిపి వేశారా.. లేదా? అక్రమ విద్యుత్ కనెక్షన్లు ఏమైనా ఉన్నాయా అని పరిశీలించారు. మీటర్ల పని తీరు తో పాటు వాడుతున్న లోడ్ తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాణ్యమైన, నిరంతర విద్యుత్ ను వినియోగదారులకు అందించడంలో ప్రభుత్వ సహకారంతో ప్రయత్నిస్తున్నా మని. వినియోగదారులు కూడా విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలని అన్నారు. వినియోగదారుల సిటిజెన్ చార్టర్ ను ఖచ్చితంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రతీ వినియోగదారుడూ తన విద్యుత్ సర్వీసుకు ఆధార్‌నంబర్‌తో అనుసందానం చేసుకోవాలని, ఇందుకు సంబంధిత సెక్షన్ కార్యాల యాన్ని సంప్రదించాలని కోరారు. ఆయన వెంట ఎస్ఇ లక్ష్మణరావు, ఇఇ నాగిరెడ్డి కృష్ణమూర్తి, విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్తు మీటర్‌ను తనిఖీ చేస్తున్న పృథ్వీరాజ్

29న బహిరంగ సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షించేందుకు సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన బైక్‌యాత్ర ముగింపు సందర్భంగా ఈనెల 29న విశాఖ కూర్మన్న పాలెం వద్ద జరుగనున్న భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు కోరారు. శనివారం దాబాతోట వద్ద జరిగిన ప్రచార సభలో కరపత్రం విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరోచిత పోరాటంతో సాధించుకున్న ఉక్కు పరిశ్రమను కారుచౌకగా కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు కేంద్రంలో బిజెపి కుట్ర పన్నుతుందని విమర్శించారు. విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని, నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలని, ఖాళీగా ఉన్న ఐదు వేల పోస్టులను భర్తీ చేయాలని, పరిశ్రమ నిర్వహణకు రూ.5వేల కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి బి.రమణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

132 కెవి వంటితాడిమెట్ట వద్ద గరివిడి ఫీడర్ లైనులో ఆదివారం నుంచి ఇన్సులేషన్ పరికరాలు మార్పు చేస్తున్నందున కొన్ని గంటలు విద్యుత్ అంతరాయనికి ప్రజలు సహకరించాలని ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ ఎం.లక్షణ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని జరగడం వలన మధ్య మధ్యలో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్లాస్టిక్‌ను నిషేధించాఇలని, పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన శనివారం సైకల్‌యాత్ర చేపట్టారు. రెడ్ క్రాస్ భవనం నుంచి ప్రారంబమైన సైకిల్ ర్యాలీ ఆర్‌టిసి కాంప్లెక్స్, కోట, మూడులాంతర్లు, గంటస్తంభం మీదుగా కలెక్టరేట్ వరకు సాగింది. కార్యక్రమంలో రెడ్ క్రాస్ మాజీ మేనేజింగ్ కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సస్పెన్షన్ కోసమే టిడిపి యాక్షన్

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎంతో హుందాగా.. ప్రజల సమస్యలపై అర్థవంతమైన చర్చ జరగాల్సిన సభలో.. మీసం తిప్పడం, విజిల్ వేయడం ద్వారా టిడిపి సభ్యులు సభను అగౌరవ పరిచారని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టుపై రాద్ధాంతం చేస్తున్న టిడిపి నాయకులు అసలు వాస్తవం ఏమిటో ప్రజలకు తెలియజేసేందుకు అసెంబ్లీ ఒక వేదికగా చర్చకు ఉపయోగపడేదని చెప్పారు. ఆ అవకాశాన్ని ఎందుకో గానీ.. టిడిపి సభ్యులే జారవిడుచుకున్నారని విమర్శించారు. శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 21, 22వ తేదీల్లో జరిగిన శాసనసభ సమావేశాల్లో టిడిపి సభ్యుల ప్రవర్తనను ప్రజలంతా గమనించారని చెప్పారు. మొత్తంగా సస్పెండ్ అవ్వడం కోసమే వారంతా యాక్షన్ చేశారని.. ఏదో ఒక విధంగా సభ నుంచి వెళ్లిపోవడమే వారి ఉద్దేశమని తెలిపారు. సమావేశాలు ప్రారంభమై నిమిషమైనా కాకముందే, స్పీకర్ పోడియాన్ని చుట్టుముట్టి గందరగోళ పరిచారన్నారు. సభాపతిని కొట్టేంత పని చేశారని చెప్పారు. చంద్రబాబు అరెస్ట్‌పై చర్చ కోరకుండా ఆయనపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని అరవడం ఎంత వరకూ సబబని, అసలు సభాపతికి ఆ హక్కు ఉంటుందా? అని ప్రశ్నించారు. 'అచ్చెన్న వంటివారు జగన్ మీద విమర్శలు చేస్తున్నారు.. పోనీ, మా ముఖ్యమంత్రి బెయిల్ మీద వచ్చారు. మీకు సత్తా ఉంటే చంద్రబాబు నిప్పు, నిజాయితీపరుడు, కడిగిన ముత్యం అని నిరూపించుకోండి' అని సవాల్ చేశారు. మిగిలిన మూడు రోజుల సమావేశాలనైనా అందుకు వినియోగించుకోవాలని హితవు పలికారు.

కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓడిపోయి, ఎన్‌టిఆర్ కాళ్లు పట్టుకొని టిడిపిలో చేరిన చంద్రబాబు.. చివరకు పిల్లనిచ్చిన మామనే వెన్నుపోటు పొడిచి పార్టీని లాక్కున్నారని కోలగట్ల విమర్శించారు. కొడుకు భవిష్యత్తుకు అడ్డు వస్తాడన్న కారణంతో జూనియర్ ఎన్టీఆర్ ను తొక్కేశాడని గుర్తు చేశారు. ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిపోయి, తెలంగాణ ముఖ్యమంత్రికి దాసోహమై, విభజన చట్టంలోని హక్కును సుమారు 8 ఏళ్ల కోల్పోయేలా చేశాడని విమర్శించారు. చంద్రబాబుకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే.. స్టేలన్నీ ఎత్తివేయించి విచారణ జరిపించుకోవాలని డిమాండ్ చేశారు.

కోరాడ వీధిలో పర్యటిస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి

పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

నగరంలోని వివిధ ప్రాంతాలలో రూ.65 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి శంకుస్థాపనలు చేశారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారం దిశగా రహదారులు, కాలువల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కోరాడ వీధి, తుపాకుల వీధి, జొన్న గుడ్డి, ధర్మపురి, తోటపాలెం, ప్రాంతాలలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ లయ యాదవ్ మాట్లాడుతూ నగరాభివృద్ధికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారన్నారు. మేయర్ విజయలక్ష్మి, జోనల్ ఇన్చార్జి డాక్టర్ వి.ఎస్.ప్రసాద్ కార్పొరేటర్లు కడియాల రామకృష్ణ, పట్నాన పైడిరాజు, పతివాడ గణపతి రావు, దుప్పాడ సునీత, జివి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధి ఎంత?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

చిత్తశుద్ధి కలిగి చేసిన పుణ్యంబు కొంచెమైనను కొదవగాదు అన్నాడు కవి వేమన. కడవడైననునేమి ఖరముపాలు అని కూడా వ్యాఖ్యానించాడు. మండలాల్లో నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమాల సందర్భంగా అచ్చంగా వేమన శతకాలను గుర్తుచేస్తున్నారు ప్రజానీకం. సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధి లేనప్పుడు ఇటువంటి కార్యక్రమాలు ఎన్నిచేసినా ఏమిటి ప్రయోజనం అని ప్రశ్నిస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కారం పేరిట చాలా కాలం క్రితం నుంచి కొనసాగుతున్న గ్రీవెన్స్ సెల్ కార్యక్రమాన్ని వైసిపి అధికారంలోకి వచ్చాక 'స్పందన'గా పేరు మార్చిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది మే నెలలో దీనిపేరు జగనన్నకు చెబుదాం అంటూ మార్పుచేశారు. పేరు మార్చినా లక్ష్యం ఒక్కటే. ప్రజాసమస్యలు పరిష్కరించే వేదికగానే కొనసాగు తున్నాయి. ఈ సందర్భంగానే జిల్లా కలెక్టర్ ప్రెస్‌మీట్ పెట్టిమరీ తమ వద్దకు వచ్చిన అర్జీలు, ఫిర్యాదులకు నిర్ధిష్టమైన కాలపరిమితిలో పరిష్కారం చూపుతామని కూడా చెప్పారు. ఇందులో ప్రతి ఫిర్యాదారుడు లేదా అర్జీదారుడు సంతృప్తి చెందే విధంగా తమ చర్యలు ఉంటాయని కూడా ఉద్ఘాటించారు. మరింతగా ఆశలు పెంచుకున్న ప్రజానీకం వినతులు మండల, జిల్లా స్థాయిలో వెల్లువిరిశాయి. వాటి పరిష్కారం చూపడంలో మాత్రం అధికారులు, ముఖ్యంగా ప్రభుత్వం వెనుకబడింది. ముఖ్యంగా మన జిల్లాలో ప్రతి సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో అందే వినతులపై సంతకాలు చేసి సంబంధిత అధికారులకు పంపడం మినహా వాటిపై పర్యవేక్షణ లేదు. దీంతో, వచ్చినవారే తిరిగి కలెక్టరేట్‌కు పదే పదే వస్తున్నారు. బహుశా రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉండడం, మరోవైపు ఎన్నికలు దగ్గర పడుతుండడంతో ప్రభుత్వం ఇక నుంచి మండల స్థాయిలోనూ జగనన్నకు చెబుదాం అంటూ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించింది. ఇందులో భాగంగానే ఈనెల 13వ తేదీన రాజాంలోనూ, 15న బొబ్బిలిలోనూ, 20న ఎస్.కోట, 22న నెల్లిమర్లలోనూ జగనన్నకు చెబుదాం కార్యక్రమాలు నిర్వహించారు. 27న గజపతినగరం, 29న చీపురుపల్లిలోనూ ఇదే కార్యక్రమం నిర్వహించనున్నారు. వీటికి జిల్లాలోని అన్ని శాఖల అధికారులూ కట్టగట్టుకుని వెళ్లారు. ప్రజల వద్దకు వెళ్లడం తప్పుకాదు. కానీ, ప్రజలే జిల్లా కేంద్రానికి వచ్చినప్పుడు పరిష్కరించని సమస్యలు, మండలానికి వచ్చి పరిష్కారం చూపుతామంటే ఎలా నమ్మాలి అంటూ జనం ప్రశ్నిస్తున్నారు. చివరకు కలెక్టర్ ఆదేశాలు తంగలో తొక్కడం, పరిష్కరించకుండానే పరిష్కరించి నట్టు నివేదికలు పంపడం వంటివి కూడా వెలుగులోకి వచ్చాయి. బహుశా ఇందుకేనేమో మండలాల్లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి స్పందన అంతంత మాత్రంగానే ఉంటోంది. ఇటీవల ఎస్.కోటలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మొత్తం 54 వినతులు మాత్రమే అందాయి. ఇందులో రెవెన్యూ 24వరకు ఉన్నాయి. దాదాపు ఈ అర్జీలన్నీ ఏడాదికి మించి కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నవారే కావడం విశేషం. హౌసింగ్ 13, సాంఘిక సంక్షేమ శాఖ, గ్రామీణాభివృద్ధికి సంబంధించి 3, వైద్యారోగ్య శాఖ 4, పంచాయతీరాజ్ శాఖ 2, ఐసిడిఎస్ 2 ఉన్నాయి. మే 9వ తేదీ నుంచి నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఈ మండలం నుంచి మొత్తం 315 వినతులు అందినట్టు అధికారులు చెబుతున్నారు. వీటిలో చాలా వరకు పరిష్కారం చేయకుండానే అర్జీదారులు సంతృప్తి చెందినట్టుగా అధికారులు రికార్డుల్లో నమోదు చేసుకుంటున్నారని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అధికారులు కూడా తీవ్ర ఒత్తిడి, అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మండల స్థాయి అధికారులు చేయాల్సిన పనికి జిల్లా స్థాయి అధికారులు ఎందుకంటూ కక్కలేక మింగలేక అధికారులు లోలోపల మదనపడుతున్నారు. మరోవైపు రోజుకో మండలం, మధ్యమధ్యలో సభలు, సమావేశాలతోనే కాలం గడిచిపోతోందని, శాఖ పరమైన పనులు చేయలేకపో ఒత్తిడికి గురౌతున్నామని కూడా చెబుతున్నారు. మరోవైపు ప్రజానీకం తల్లికి పట్టెడు అన్న పెట్టనివాడు పిన్నమ్మకు బంగారు గాజులు కొంటానని మాటిచ్చినట్టుగా జిల్లా కేంద్రానికి వచ్చినప్పుడే పరిష్కారం చూపలేనివారు మండలాలకు వచ్చి ఏం చేస్తారని జనం చర్చిస్తున్నారు. ఇదంతా ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆడిస్తున్న నాటకం తప్ప చిత్తశుద్ధి లేదన్నది పబ్లిక్ టాక్.

సైబర్ నేరాలకు పాల్పడితే మూడేళ్లు జైలు

ప్రజాశక్తి - బొబ్బిలి

సైబర్ నేరాలకు పాల్పడితే మూడేళ్లు జైలుశిక్ష, రూ.2లక్షల వరకు జరిమానా పడుతుందని సీనియర్ సివిల్ జడ్జి టి.వాసుదేవన్ అన్నారు. ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్లు వినియోగం పెరగడంతో పాటు ఎలక్ట్రానిక్ టెక్నాలజీ పెరగడం వల్ల సైబర్ నేరాలు పెరిగిపోయాయన్నారు. సైబర్ నేరాలను నివారించేందుకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్‌ను 2000 సంవత్సరంలో తీసుకువచ్చినట్లు చెప్పారు. రెచ్చగొట్టే మాటలను, కించపరిచే మాటలను ఆడియో, వీడియోలను సామాజిక మీడియాలో ప్రచారం చేస్తే మూడేళ్ల జైలు శిక్ష, రూ.2లక్షల వరకు జరిమానా ఉంటుందన్నారు. వ్యక్తిగత భద్రతకు భంగం కలిగిస్తే కఠిన శిక్ష ఉంటుందన్నారు. విద్యార్థి దశలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ నేరాలకు పాల్పడితే ర్యాగింగ్ కింద పరిగణించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. రాజ్యాంగానికి లోబడి చట్టాలను చేయాలన్నారు. చట్టాలకు లోబడే ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. వాసు విద్యా కరస్పాండెంట్ రౌతు వాసుదేవరావు మాట్లాడుతూ చదువు జ్ఞానాన్ని పెంచడంతో పాటు వ్యక్తిగత, కుటుంబ, సమాజ అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రమశిక్షణతో చదువుకోవాలని కోరారు. విద్య, వైద్య రంగాలను అభివృద్ధి చేసేందుకు రోటరీ క్లబ్ పని చేస్తుందని రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జేసీ రాజు, వి.శ్రీహరి, రీజనల్ చైర్ తూముల కార్తీక్, ట్రెజరర్ శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవన్

బొబ్బిలి: మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి టి. వాసుదేవన్

నందిగాం గ్రామాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

డెంకాడ (భోగాపురం) : నందిగాం గ్రామాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా జడ్జి సాయి కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. న్యాయ సేవా సదన్ ఆధ్వర్యంలో శనివారం నందిగాంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సాధారణంగా జిల్లాలోనే అన్ని విభాగాల్లో వివాద రహిత గ్రామంగా గుర్తించిన నందిగాం గ్రామానికి ముందుగా శుభాకాంక్షలు తెలిపారు. న్యాయసేవా సదన్ అవగాహన కార్యక్రమాలు ఎక్కువగా వివాదాలు ఉండే గ్రామాల్లో మాత్రమే నిర్వహిస్తామని ఎందుకంటే వారికి అక్కడ ఉన్న ప్రజలకు వివాదాల్లోకి వెళితే మున్ముందు కుటుంబ ఆర్థిక నష్టాలు ఎంత తీవ్రంగా ఉంటాయో, చట్టాలపై అవగాహన కోసం ఈ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటామని అన్నారు. కానీ న్యాయ సేవా సదన్ తరుపున వివాద రహితంగా ఉన్న గ్రామాన్ని సందర్శించి ఇక్కడ ఉన్న గ్రామ పరిస్థితులు, ప్రజలను, నాయకత్వాన్ని చూస్తూ ఉంటే ముచ్చటేస్తుందన్నారు. ఈ గ్రామంలా మిగతా గ్రామాలన్నీ మారాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. ప్రజలంతా చట్టాలపై అవగాహన పెంచుకొని, వివాదాలకు దూరంగా ఉండాలని కోరారు. నందిగాం గ్రామాన్ని జిల్లాలో అన్ని గ్రామాలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రతి పౌరుడు వివాదాలకు దూరంగా ఉండాలన్నారు. ఇక్కడ మహిళా సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను వారు ఉత్పత్తి చేస్తున్న ఉత్పత్తులను చూసి పట్టణాలలో ఇటువంటి ఉత్పత్తులు చేయాలన్నారు. ఆన్‌లైన్ మార్కెటింగ్ ద్వారా వ్యాపార విస్తరణ చేస్తే వారికి ఆర్థిక పరిపుష్టి కలుగుతుందన్నారు. జిల్లా న్యాయ సేవా సదన్ జడ్జ్ నాగలక్ష్మి మాట్లాడుతూ నందిగాం వంటి గ్రామంలో సమావేశం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సిహెచ్ బంగారు రాజు, సిఐ వెంకటేశ్వరరావు, ఎంపిడిఒ అప్పలనాయుడు, అడ్వకేట్స్ సత్యం, కుమార్, మూడు మండలాల ఎస్ఐలు, సచివాలయ సిబ్బంది, ఐసిడిఎస్, వెలుగు సిబ్బంది మహిళా సంఘం సభ్యులు తోపాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రాజకీయ ఒత్తిళ్లతో తహశీల్దార్ బదిలీ

రేగిడి: స్థానిక తహశీల్దార్ టి. కళ్యాణ చక్రవర్తి విజయనగరం కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా డిప్యుటేషన్ పై బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో దత్తిరాజేరు తహశీల్దార్‌గా పనిచేస్తున్న బి. సుదర్శన్ రావును డిప్యుటేషన్ పై రేగిడి తహశీల్దారుగా బదిలీ చేశారు. నిబద్ధతతో పని చేసిన కళ్యాణ చక్రవర్తి రెండునెలల క్రితమే ప్రభుత్వ భూముల విషయంలో కొత్తవారికి పట్టాలివ్వాలని, పాత పట్టాలను రెగ్యులర్ చేయాలని స్థానిక నాయకులు ఒత్తిళ్లకు లొంగకపోవడంతో బదిలీ చేసినట్లు తెలిస్తోంది. అయితే 24 గంటల్లో రెండుసార్లు ఒకే వ్యక్తిని బదిలీ చేయడంపై చర్చనీయాంశమైంది. తొలుత గురువారం బదిలీ చేసిన అధికారులు శుక్రవారం బదిలీని నిలిపేశారు. తిరిగి శనివారం మరోసారి బదిలీ చేయడం వెనుక రాజకీయ నాయకుల ఒత్తిళ్లు ఉన్నట్లు తెలిస్తోంది.

ఘనంగా స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్

శృంగవరపుకోట: మండలంలోని భవాని నగర్‌లోని శ్రీగౌరీ విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో శనివారం స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్‌ని రెండవ ఎంఇఒ. గణపతి లక్ష్మి ప్రారంభించారు. విద్యార్థులు మూడు నెలల్లో నేర్చుకున్న పాఠ్యాంశాలు చార్ట్ రూపంలో, ప్రాజెక్టులు రూపంలో తయారు చేసి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాండ్రేగుల వెంకట రామ మాట్లాడుతూ లీడ్ ఇంటర్నేషనల్ కరికులం వల్ల విద్యార్థులు సర్వతో ముఖాభివృద్ధి సాధిస్తున్నారని అన్నారు. లీడ్ అకడమిక్ డైరెక్టర్ వర్మ చిత్తరంజన్ మిశ్రా, కరస్పాండెంట్ సన్యాసినాయుడు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గృహసారథులకు బీమా

బొండపల్లి: పార్టీ కోసం పనిచేసే గృహ సారథులకు బీమా సౌకర్యం కల్పిస్తున్నామని వైసిపి మండల అధ్యక్షులు బొద్దల చిన్నంనాయుడు అన్నారు. శనివారం మండలంలోని గొల్లుపాలెం, కనిమెరక సచివాలయాల పరిధిలోని గృహసారథుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గృహ సారథుల సంక్షేమానికి వైసిపి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. మండల పరిధిలో 278 మంది వాలంటీర్ల పరిధిలో 556 మంది గృహ సారథులకు బీమా సౌకర్యం కల్పించి వారి కుటుంబాలకు పార్టీ భరోసా కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల జెసిఎస్ కన్వీనర్ పల్లె రఘు, నాయకులు కర్రి కృష్ణ, తొత్తడి సత్తిబాబు, బొడసింగి జగదీశ్వర రావు, సచివాలయ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ పునరుద్ధరణే లక్ష్యం

శృంగవరపుకోట: పాత పెన్షన్ పునరుద్ధరణే ఏకైక లక్ష్యమని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ సందర్భంగా శనివారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద వారు నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ శ్రీనివాసరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్, ఎస్‌టియు, ఎపిటిఎఫ్ భాగస్వామిలైన ఫ్యాప్టో తరపున సీనియర్ నాయకులు జి వెంకటరావు, జివి రమణ, ఎం కొండలరావు, ఎ.శ్రీనివాస్, సిహెచ్ సూరిబాబు, ఎ.రామ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

మండల స్థాయి అధికారులతో సమీక్ష

వేపాడ: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల స్థాయి అధికారులతో ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇంతవరకు చేపట్టిన పనులపై అధికారులను ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ప్రతి అభివృద్ధి పనిని పూర్తి చేసి ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందించాలన్నారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ సంస్థ ఎఇ, ఎపిఒ, ఎపిఎం, ఎలక్ట్రికల్ ఎఇ, ఎంఇఒ తదితరులు పాల్గొన్నారు.

వైసిపితో దళితులకు అన్యాయం

వేపాడ: వైసిపితో దళితులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని మండల దళిత మహాసభ అధ్యక్షుడు కోమటపల్లి రాము అన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇప్పటికైనా దళిత నాయకులు ఐక్యమత్యంగా ఉండి ఎస్‌సి, ఎస్‌టిలకు ఈ ప్రభుత్వం వచ్చాక ఎంత అన్యాయం జరిగిందో వివరించాలన్నారు. దళిత నాయకులుగా చలామణి అవుతూ రాజకీయ నాయకులకు తొత్తులుగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. పోలీస్ స్టేషన్లు, రెవెన్యూ కార్యాలయాల వద్ద కూర్చొని దరఖాస్తులు రాస్తూ తగాదాలు సృష్టించకుండా హక్కుల కోసం దళిత నాయకులు పోరాటం చేయాలన్నారు.

నెలాఖరుతో ముగియనున్న గడువు

డెంకాడ : 2024 మార్చిలో జరిగే ఇంటర్ పరీక్షలకు ఈనెల 30వ తేదీ వరకు పరీక్ష ఫీజు కట్టుకునేందుకు అవకాశం ఉందని దీనిని ఇంటర్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం ఆదినారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 మార్చిలో జరిగిన ఇంటర్ పరీక్షలు ఫెయిలైన విద్యార్థులకు ఈ అవకాశం ఉంటుందని వెల్లడించారు.

సచివాలయం సందర్శన

వేపాడ: మండలంలోని వావిలిపాడు సచివాలయాన్ని ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా జగనన్న ఆరోగ్య సురక్ష, ఆయుష్మాన్ భవ కార్యక్రమాలు ప్రజలకు అందజేశారు. అనంతరం హౌసింగ్ డేని పురస్కరించుకొని జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నాడు నేడు నిధులతో పాఠశాలలో చేపట్టిన పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ సంస్థ ఎఇ, పంచాయతీ కార్యదర్శి నాయుడు, సచివాలయంలో పనిచేస్తున్న ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

30 నుంచి ఆరోగ్య సురక్ష

తెర్లాం: ఈ నెల 30 నుంచి అక్టోబరు 25 వరకూ గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని ఎంపిడిఒ ఎ.రామకృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఆయన శనివారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ఇద్దరు స్పెషలిస్ట్ డాక్టర్లు, పెరుమాలి, తెర్లాం ప్రాథమిక ఆరోగ్య శాఖ అధికారులు మొత్తం నలుగురు డాక్టర్లు పాల్గొంటారని తెలియజేశారు. ఇందులో 14 రకాలైన టెస్టులు అవసరమైన వారికి చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని తెలియజేశారు.

ఇవిఎం గోదాములను కలెక్టర్ పరిశీలన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక ఇవిఎం గోదాములను జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి శనివారం తనిఖీ చేశారు. అక్కడి భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన గదులను, వాటికి వేసిన సీళ్లను పరిశీలించారు. రెండు గోదాముల్లో సిసి కెమేరాలు, విద్యుత్ దీపాలు, ఫ్యాన్లు పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలని ఆదేశించారు. గోదాముల్లోని అనవసర వస్తువులను తక్షణమే అక్కడి నుంచి తీసివేయాలని సూచించారు. ఖాళీ గదులన్నిటినీ శుభ్రంచేసి, వినియోగానికి సిద్ధంగా ఉంచాలని, గోదాములవద్ద భద్రత పటిష్టం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ఇవిఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

ఇవిఎంల తొలిదశ తనిఖీ పరిశీలన

గోదాముల వద్ద జరుగుతున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల తొలిదశ తనిఖీ (ఎఫ్ఎల్‌సి) ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఇంజనీర్లు అక్కడి ప్రక్రియను కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలోని సుమారు 5,600 ఇవిఎంలను తనిఖీ ప్రక్రియను ఈ నెల 20న ప్రారంభించామని, ఆదివారంతో ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు ఇంజనీర్లు తెలిపారు. బిహెచ్ఇఎల్‌కు చెందిన ఐదుగురు ఇంజనీర్ల ఆధ్వర్యంలో, శిక్షణ పొందిన సచివాలయాల ప్లానింగ్ సెక్రటరీలు ఇవిఎంల తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీల్లో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిఆర్ఒ ఎస్‌డి అనిత, ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ దేవ్ ప్రసాద్, నెల్లిమర్ల తహశీల్దార్ డి.ధర్మరాజు, డిటి డి. శైలజ, నగర పంచాయతీ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్, వైస్ ఛైర్మన్ సముద్రపు రామారావు, రెవెన్యూ సిబ్బంది, పాల్గొన్నారు.

కొనసాగుతున్న టిడిపి దీక్షలు

ప్రజాశక్తి- బొబ్బిలి

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా బొబ్బిలిలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు కొనసాగుతున్నాయి. పదకొండో రోజు శనివారం దీక్షలను నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ కక్షతోనే చంద్రబాబును అరెస్టు చేశారన్నారు. టిడిపికి రాష్ట్రంలో ఆదరణ పెరగడంతో చూసి సిఎం జగన్మోహన్ రెడ్డి ఓర్వలేకపోతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో దిబ్బగుడివలస, నారాసింహునిపేట టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజకీయ కుట్రతోనే అక్రమ కేసులు

గరివిడి: రానున్న ఎన్నికల్లో వైసిపికి భంగపాటు తప్పదన్న భయంతోనే చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించారని చీపురుపల్లి నియోజకవర్గ ఇంచార్జి కిమిడి నాగార్జున అన్నారు. శనివారం చీపురుపల్లిలో ఆ పార్టీ నాయకులు నిరాహార దీక్షలు కొనసాగించారు. ఈ దీక్షల్లో గరివిడి మండలం కోనూరు గ్రామ మాజీ సర్పంచ్ వెంపడాపు రమణ మూర్తి, మీసాల రాము, గడి సూర్యనారాయణ, మంత్రి కాంతమ్మ, బూర్లే తవుడమ్మా, మీసాల సత్యవతి, మండల నాయకులు రౌతు కాము నాయుడు, పైల బలరాం, సారేపాక సురేష్‌బాబు, మహంతి రమణ మూర్తి, చింతపల్లి గోవింద, మీసాల సత్యం, దుక్క సూర్యనారాయణ, మంత్రి అప్పల నాయుడు, మంత్రి సూర్యనారాయణ, గొట్టిముక్కల సత్యనారాయణ రాజు, నకెళ్ళ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: నియోజకవర్గం కేంద్రంలో టిడిపి నాయకులు చేపట్టిన దీక్షలు శనివారం కొనసాగాయి. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు, నాయకులు సువ్వాడ రవిశేఖర్, మహంతి చిన్నంనాయుడు, కడగల ఆనంద్, గేదెల రాజారావు, కంది చంద్రశేఖర్, లెంక అప్పలనాయుడు, పోతల రాజప్పన్న, అవనాపు సత్యనారాయణ, కర్రోతు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం కోట: 11వ రోజు శనివారం కూడా ఆపార్టీ నాయకులు నిరసన దీక్ష కొనసాగించారు. టిడిపి సాంస్కృతిక విభాగం ఆధ్వర్యాన అశోక్‌బంగ్లా వద్ద దీక్ష చేపట్టారు. పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజు దీక్షలను ఉద్దేశించి మాట్లాడారు. సాయంత్రం నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు. మాజీ ఎమ్మెల్యే మీసాల గీత స్థానిక వెంకటరమణ జూనియర్ కళాశాల విద్యార్థులతో పోస్ట్ కార్డుపై అభిప్రాయాలు రాయించారు. ఈ కార్డులు రాజమండ్రి జైలులో ఉన్న చంద్రబాబు నాయుడుకు పంపుతామని తెలిపారు.

పోలీస్ స్టేషన్‌ను ఎస్‌పి తనిఖీ

ప్రజాశక్తి - తెర్లాం

స్థానిక పోలీస్ స్టేషన్‌ను శనివారం జిల్లా ఎస్‌పి దీపిక పాటిల్ తనిఖీ చేశారు. ఎస్ఐ ఆర్ రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించి స్వాగతం పలికారు. అనంతరం గ్రామ సచివాలయ మహిళా పోలీసులతో ఆమె కాసేపు ముచ్చటించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రానున్న రోజుల్లో ఎన్నికలు ఉన్న సందర్భంగా గ్రామాల్లో సామరస్యమైన వాతావరణం నెలకొల్పేటట్లు ఎస్ఐ సహాయంతో కృషి చేయాలన్నారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. అనంతరం రికార్డులు పరిశీలన చేసి క్రైమ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలో శాంతిభద్రతలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్ఐ రమేష్ సౌజన్యంతో ఉత్తమ విద్యార్థులకు ఎస్‌పి చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ తనిఖీల్లో వారితోపాటు డిఎస్‌పి, సిఐ, తెర్లాం, బాడంగి, రామభద్రపురం ఎస్ఐలు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థినులకు బహుమతులిస్తున్న ఎస్‌పి

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

సమగ్ర శిక్షా ప్రాజెక్టులో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సిఆర్‌పిల రాష్ట్ర యూనియన్ ప్రధాన కార్యదర్శి కె. గురువులు డిమాండ్ చేశారు. సమగ్రశిక్ష రాష్ట్ర జెఎసి పిలుపు మేరకు ఈ నెల 25న మండల విద్యాశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులందరూ సామూహిక సాధారణ సెలవు పెడుతున్నట్లు మండల విద్యాశాఖాధికారులకు శనివారం ధరఖాస్తును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తన పాదయాత్ర సమయంలో కాంట్రాక్టు ఉద్యోగులందరిని రెగ్యులరైజ్ చేస్తానని చెప్పారన్నారు. ప్రభుత్వం ఏర్పడి 4ఏళ్ళు పూర్తైన తమని పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులందరిని రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, డిఎ హెచ్‌ఆర్ఎతో కూడిన కనీస వేతన స్కేలును అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇఎస్ఐ, పిఎఫ్, హెల్త్ కార్డుల సౌకర్యం కల్పించడం తోపాటు ప్రతి నెల 5వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ నెల 25వ తేదీన విజయవాడలో పెద్ద ఎత్తున సమగ్రశిక్ష ఉద్యోగుల సమూహిక సత్యాగ్రహ దీక్ష జెఎసి ఆధ్వర్యంలో చెపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

కంపెనీల ప్రతినిధులతో సమావేశం

డెంకాడ: స్థానిక ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం దిగ్గజ పరిశ్రమల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. డిపెండబిలిటీ, కన్సిస్టెన్సీ, అకౌంటబిలిటీ, నేటి జాబ్ మార్కెట్‌లో విజయం సాధించడానికి నైపుణ్యాలతో పాటు అవసరమైన లక్షణాలు' అనే థీమ్‌తో హెచ్‌ఆర్ సమావేశం నిర్వహించారు. ఎక్స్ ఇండియాహెడ్ హెచ్‌ఆర్ నిపుణుడు పొన్నుస్వామి, రెనాల్ట్ నిస్సాన్‌బీ టి.ఆరుముగం, కోనే హెచ్‌ఆర్ డిజిఎం ఎస్.రత్నవేల్ రాజన్, ఆసియా పసిఫిక్ బాల్ కార్పొరేషన్ ప్రాంతీయ హెచ్.ఆర్, డాక్టర్ ఎం.ఇరుధయరాజ్ పాల్గొని చర్చించారు. ఐజాక్ పట్టురాజా మాట్లాడుతూ ప్రతి సబ్జెక్టులో గరిష్ట మార్కులు సాధించాలని విద్యార్థులకు సూచించారు. పోటీ ప్రపంచంలో విజయం సాధించడానికి పై రెండు సూత్రాలకు తమను తాము మ్యాపింగ్ చేయడానికి ఒక రోజులో కనీసం 15 నిమిషాలు కేటాయించాలని ఆయన విద్యార్థులను కోరారు. చార్లెస్ లెనిన్ రెజ్యూమ్ ప్రిపరేషన్‌పై చర్చించారు. విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలలో చాలా బలంగా ఉండాలని కోరారు. దివ్య శ్రీనివాసన్ పరిశ్రమలపై విద్యార్థుల అవగాహన, వాస్తవికత వర్సెస్ పరిశ్రమల అంచనాలు, పరిశ్రమలో విద్యార్థులు ఎదుర్కొంటున్న నిజమైన సవాళ్లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పి.సీతారామరాజు, డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్.రమేష్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం సునీల్ ప్రకాష్, డీన్ డాక్టర్ ఎంవివి భాను, అధ్యాపకులు, పాల్గొన్నారు.

ధర్నా జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఈ నెల 25న జరగనున్న అంగన్ వాడీల మహాధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు నాయకులు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు, కాళ్ళ అప్పల సూరి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక అమర వీరుల స్మారక భవనంలో వారు మాట్లాడుతూ అంగన్ వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 25న విజయవాడలో ఏపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మహాధర్నా జరుగుతున్నట్లు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా అంగన్‌వాడీలు గ్రామీణ, పట్టణ, మురికివాడల్లో పేదలకు, బాలింతలకు, చిన్న పిల్లలకు అనేక రకాలుగా సేవలు అందిస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారి కష్టాన్ని గుర్తించడం లేదన్నారు. చాలీ చాలని వేతనంతో వెట్టి చాకిరీ చేస్తున్నారన్నారు. నిత్యవసర వస్తువుల, పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతున్నా అంగన్ వాడీల వేతనాలు మాత్రం పెరగడం లేదన్నారు. ఈ నేపథ్యంలో మహాధర్నా చేపట్టినట్లు తెలిపారు. ఈ సమస్యలపై సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో సామూహిక మహాధర్నా జరుగుతుందని అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కార్మికుల నిరసన

ప్రజాశక్తి- బొబ్బిలి

మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పర్మినెంట్ చేయాలని, 010 కింద వేతనాలు చెల్లించాలని, ఆప్కాస్ రద్దు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకరరావు డిమాండ్ చేశారు. శనిరవారం పట్టణంలో మున్సిపల్ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25న మున్సిపల్ ఆఫీసు వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తామని చెప్పి ఇప్పుడు వివక్షత చూపుతున్నారని అన్నారు. మాట తప్పను మడమ తిప్పను అని చెప్పిన పెద్దమనిషి ఈరోజు మున్సిపల్ కార్మికులకు ద్రోహం చేస్తున్నారన్నారు. అడుగడుగునా మున్సిపల్ కార్మికులకు వైసిపి ప్రభుత్వం ద్రోహం చేస్తూ ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే మున్సిపల్ కార్మికుల డిమాండ్స్ పరిష్కారం చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు సైతం సిద్ధమవుతామని హెచ్చరించారు.

హౌసింగ్ డే

డెంకాడ: మండలంలోని డి.తాళ్లవలస జగనన్న కాలనీలో శనివారం హౌసింగ్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ డిడి స్వరూప రాణి మాట్లాడుతూ గ్రామంలో జగనన్న కాలనీలు 80 ఇల్లు మంజూరు కాగా అందులో 30 మంది వరకే పునాదులు వేశారని కేవలం ముగ్గురే ఇంటి నిర్మాణాలను పూర్తి చేశారని చెప్పారు. లబ్ధిదారులందరూ ఇంటి నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆర్థిక స్తోమత లేని వారికి డ్వాక్రా గ్రూపుల ద్వారా లోను మంజూరు చేస్తున్నారని తెలిపారు. జగనన్న కాలనీలోనికి మెటీరియల్ తీసుకువెళ్లడానికి సరైన రోడ్డు సౌకర్యం లేదని లబ్ధిదారులు ఎంపిడిఒ దృష్టికి తీసుకువచ్చారు. రోడ్డుకు ప్రతిపాదనలు పంపించాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఎంపిడిఒ ఆదేశించారు.

అంతరిక్ష వారోత్సవాలు

చీపురుపల్లి: స్థానిక రవీంద్రభారతి పాఠశాలలో అంతరిక్ష పరిశోధన వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన స్పేస్ నమూనా, కృత్రిమ ఉపగ్రహాల నమూనా, ఉపగ్రహ ప్రయాణ నమూనా వీక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇలాంటి వారోత్సవాలు విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీసి వారి ఉజ్వల భవిష్యత్తుకు ఖచ్చితమైన చిరునామాగా నిలుస్తాయని పాఠశాలల చైర్మన్ ఎంఎస్ మణి అన్నారు. వారోత్సవాల్లో చివర రోజు శనివారం గతేడాది నాసా నిర్వహించిన నాసా అమ్స్ స్పేస్ కాంటెస్ట్‌లో విజేతలుగా నిలిచి లాస్ ఏంజెల్స్‌లో జరిగిన కాన్ఫరెన్స్ కు ఇండియా తరపున హాజరైన తమ విద్యార్థులను ఉత్తరాంధ్ర రవీంద్ర భారతి పాఠశాలల జోనల్ ఇంచార్జి ఎన్.వెంకటేష్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ కరుణ, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హామీలు అమలుకు ప్రాధాన్యత

ప్రజాశక్తి- బొబ్బిలి

హామీలు అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని 16వ వార్డులో మున్సిపల్ అధికారులతో కలిసి ఆయన శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఎన్నికల హామీ మేరకు వార్డులో రోడ్లు, కాలువలు నిర్మించామని, మిగిలిన పనులు పూర్తి చేస్తామన్నారు. వార్డులలో మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు ప్రతి సచివాలయానికి రూ.20లక్షలు మంజూరు అయ్యాయన్నారు. ఈ నిధులతో సచివాలయాల పరిధిలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. వైసిపి ప్రభుత్వం అభివృద్ధికి పెద్ద పీట వేస్తుందని అందులో భాగంగానే అభివృద్ధి పనులు చేపడుతున్నామని వెల్లడించారు. ఆయనతో మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, కౌన్సిలర్ ఎస్.రామకృష్ణ, డిఇ రవికుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృత దేహం లభ్యం

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలో నాతవలస టోల్ ప్లాజా సమీపంలో జాతీయ రహదారి పక్కన శనివారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. మృతునికి సుమారు 50 ఏళ్ళు ఉంటాయని మూడు రోజుల క్రితం చనిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. మృత దేహం డికంపోజ్ అయిపోవడం వల్ల అక్కడే శవ పంచనామా నిర్వహించారు. మృతదేహం వద్ద ఎంటువంటి ఆనవాలు కనిపించలేదని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని ఎస్ఐ యు. మహేష్ తెలిపారు.

కెజిపూడి ప్రాంతంలో పులి సంచారం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కెజి పూడి రెవెన్యూ పరిధిలో శనివారం సాయంత్రం పులి రావాడ దేముడు అను రైతుపాకలో దూడను హతమార్చింది. రైతు సమాచారం ఇవ్వడంతో అటవీ శాఖ అధికారి డిఆర్ఒ రవికుమార్, ఫారెస్టు గార్డు సూర్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పరిసర ప్రాంతంలోనే పులి సంచరిస్తున్నట్లు అధికారులు గుర్తించి గ్రామస్తులతో సమాచారం ఇచ్చారు. పరిసర ప్రాంతాలలో జాగ్రత్తగా ఉండాలని సాయంత్రం వేళల్లో ఆరు బయట తిరగడం గాని. తోటల వైపు వెళ్లడం గాని చేయకూడదని తెలిపారు. పులి సంచారం సమాచారం తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు

చెట్లను నరికేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారు?

ప్రజాశక్తి- శృంగవరపుకోట

చట్టాలను పట్టించుకోకుండా ఇష్టానుసారంగా భారీ చెట్లను నరికేస్తుంటే ప్రభుత్వ శాఖల అధికారులు ఏం చేస్తున్నారని న్యాయమూర్తి సబ్బవరపు వాణి ప్రశ్నించారు. శనివారం వివిధ శాఖల అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి ఇకపై పూర్తి స్థాయి అనుమతులు లేకుండా చెట్లను తొలగించే ప్రశ్న తలెత్తకుండా పర్యావరణ పరిరక్షణకు తగు చర్యలు తీసుకోవాలని ఆమె తహశీల్దార్ డి.శ్రీనివాసరావుకు సూచించారు. పర్యావరణ ప్రేమికుడు, న్యాయవాది బొబ్బిలి రామకృష్ణ విశాఖ-అరకు రోడ్డు పక్కన రోడ్లు భవనాలు శాఖ పరిధిలో ఉన్న భారీ టేకు చెట్టు నరికివేతను తప్పు బడుతూ తహశీల్దార్, ఆర్ అండ్ బి విశాఖ ఎన్ హెచ్ ఎఇ, విద్యుత్ ఉద్యోగి, విద్యుత్ కాంట్రాక్టర్, ఇతర వ్యక్తులపై ఎస్.కోట జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ప్రీ లిటిగేషన్ కేసు వేశారు. ఈ కేసు విచారణకు సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు. కోర్టులో శనివారం జరిగిన కేసు వాదనలు సందర్భంగా మండల రెవెన్యూ సర్వేయర్, మండల రెవెన్యూ పరిశీలకుల క్షేత్ర పరిశీలన నివేదిక ఆధారంగా నిజాలు నిర్ధారణ చేసుకోవడంలో తప్పిదం జరిగిందని భేషరతుగా అంగీకరిస్తూ టేకు చెట్టు తొలగింపునకు యిచ్చిన అనుమతికి బాధ్యత వహిస్తూ ఒక చెట్టుకి పది చెట్లు చొప్పున నాటిస్తామని తహశీల్దార్ సవినయంగా కోర్టుకు మనవి చేసుకున్నారు. అందుకు అభ్యంతరం తెలుపుతూ ఫిర్యాదుదారు, న్యాయవాది బొబ్బిలి రామకృష్ణ ఇటువంటి చర్యల్లో వికారియస్ లయబిలిటీ సాకుతో చట్టం నుండి తప్పించుకోవాలనుకోవడం సబబు కాదన్నారు. ఇటువంటి రాజీ తనకు సంతృప్తికరంగా లేదన్నారు. రూల్ ఆఫ్‌లా, ప్రిన్సిపల్ ఆఫ్ నేచరల్ జస్టిస్ (సహజ న్యాయ సూత్రం) ప్రకారం చట్టం ముందు సామాన్యుడైనా, అధికారులైనా సమానమేనని, ఒకే విధమైన శిక్షలే విధించబడాలని కోర్టు దృష్టికి తెచ్చారు. ఎపి వాల్టా-2002 చట్టం ప్రకారం ముందస్తు అనుమతి లేకుండా చెట్టును తొలగించినట్లయితే ఆ చెట్టు ఖరీదుకు రెండు నుండి ఐదు రెట్లు సొమ్మును ప్రభుత్వ ఖజానాకు జరిమానాగా కట్టవలసి ఉంటుందని, ఈ లెక్కన అభివృద్ధి పేరుతో ఎన్ని చెట్లు నిర్లక్ష్యంగా తొలగించారో అంతకుమించి జరిమానాను వ్యక్తి గత స్థాయిలో కట్టవలసి ఉంటుందన్నారు. న్యాయమూర్తి స్పందిస్తూ ప్రీ లిటిగేషన్ కేసు విచారణ ద్వారా ఇది పరిష్కరించలేమని, ప్రత్యేక కేసు దాఖలు చేయాలన్నారు. ఇక ముందు ఎవరైనా అనుమతి లేకుండా చెట్టు నరికితే కఠినంగా అధిక మొత్తంలో జరిమానాలుంటాయనే విషయమై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ కేసును వచ్చే నెల 21వ తేదీకి వాయిదా వేశారు. ఈ కేసు విచారణకు ఆర్ అండ్‌బి డిఇఇ నరసింహారావు, ఎఇ, తహశీల్దార్ తదితరులు హాజరు కాగా విద్యుత్ శాఖ ఎఇ, పంచాయతీరాజ్ ఇఇ తదితరులు వాయిదాకు హాజరయ్యేలా న్యాయమూర్తి వాణి నోటీసులు జారీ చేశారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT VIZIANAGARAM
O.S.41/2021

Between:
Madagala Srinivasarao ....Plaintiff
And:
Smt.Dantuluri Bharathi and two others ....Defendants

NOTICE

Defendants:
1. Smt. Dantuluri Bharathi, W/o. late Narasa Bhupala Raju, Hindu, aged about 43 years, residing at Door No:313-70, Samadanampeta, Near: R & B Guest House, Rythu Bazar, Behind Balaji Gorcery Stores, Cantonment, Vizianagaram.
2. Dantuluri Soumith Varma, S/o. late Narasa Bhupala Raju, Hindu, aged about 22 years, residing at Door No:313-70, Samadanampeta, Near: R & B Guest House, Rythu Bazar, Behind Balaji Gorcery Stores, Cantonment, Vizianagaram.
3. Dantuluri Sreeja Varma, D/o.late Narasa Bhupala Raju, Hindu, aged about 21 years, residing at Door No:313-70, Samadanampeta, Near: R & B Guest House, Rythu Bazar, Behind Balaji Gorcery Stores, Cantonment, Vizianagaram.

Please take notice the above plaintiff filed the above suit for specific performance and so also filed an I.A.392/2021 for grant of ad-interim injunction and in both the suit and I.A. are posted to 10.10.2023 for your appearance before the above Honourable court at 10:30 AM before either personally or through an Advocate duly authorized by you. If you fails to appear the above court on **10.10.2023 at 10:30 A.M.** the matter will be decided in your absence as per the records available on record.

K.B.PARAMESWARA RAO
Advocate for Plaintiff
Vizianagaram
Cell: 9440738336

మహారాజశ్రీ విజయనగరం సీనియరు సివిల్ జడ్జివారి కోర్టులో
A.S.90/2019

Between:
Karri Bala ....Petitioner
And:
1. Gorle Narayanamma W/o Padiraju, Yatha street, Dasannapeta, Vizianagaram.
2. Reddi Santhosh W/o Srinu, Althi street, Dasannapeta, Vizianagaram.
3. Korada Gowri W/o Satyanarayana, Althi street, Dasannapeta, Vizianagaram.
4. Gandi Jayaram @ Nadipena Jyothi w/o Srinu, Althi Srinu, Dasannapeta, Vizianagaram.
5. Nadipena Jyothi w/o Srinum yatha street, Dasannapeta, Vizianagaram.
6. S.Saraswathi W/o Venkataramana, Mangalastreet, Poolbagh, Vizianagaram.
7. Botta Ramadevi w/o Golla Street, Dasannapeta, Vizianagaram.
8. Yatha Mutyalamma w/o Dasannapeta, Vizianagaram.
9. Korada Eswaramma W/o Babji, Althi street, Dasannapeta, Vizianagaram.
10. Kalyani Bushana, Althi street, Dasannapeta, Vizianagaram.
11. Thirumala Nookaraju s/o Ramu, Rothu Street, Meekala Kannela, Vizianagaram.
12. Arji Bangarraju s/o Sankararao, Shop No. 240 SBT Market, contonment, Vizianagam
13. Rothu Narsingarao S/o late Lakshmana reddy, Routhu street, vizianagaram ......Respondents

NOTICE TO PUBLIC

ఇందుమూలముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా పై నెంబరులో పిటిషనరును దివాలా దారుగా తీర్మాణించమని కోరుచూ పై రెస్పాండెంట్సుపై పై నెంబరు పిటిషను దాఖలు చేసినందున ఎవరికైనా ఆక్షేపణలున్న యెడల **తే 14-10-2023దీన ఉదయం 10-30 గంటలకు** పై కోర్టువారి ఎదుట హాజరై మనవి చేసుకొనవలెను. లేనిచో సదరు పిటిషను మీ పరోక్షమందు తీర్మానించబడును.

J.Bheemasena Rao
Advocate for Petitioners
Cell: 9441053628

IN THE COURT OF THE HON'BLE ADDITIONAL SENIOR CIVIL JUDGE, NARASARAOPET,PALNADU (DIST,) A.P.
I.A. No. 545/2023 in IA No. 64/2022 in OS No. 4/2021

Between
Tirumala Milk Products Pvt. Ltd., rep by its Legal Manager, Narasaraopet ...Petitioner / Plaintiff
And
Chalumuri srinivasu (died) and others
Chalumuri Saraswathi W/o late Srinivasu A/35 yrs, House wife, D.No. 8-4, Plot No. 40, Gollalapeta, ndustrial Estates, Vijayanagaram Town and Mandal and District, A.P. .... Respondents / Defendants

పై నెంబరు దావా నందు చలుమూరి శ్రీనివాసు తండ్రి : కృష్ణ అనే అతనిపై తిరుమల మిల్క్ ప్రొడక్ట్స్ వారు ఓ.యస్.నెం. 4/21 గా ప్రామిసరీ నోటు దావా వేసియున్నారు. సదరు దావా నందు చలుమూరి శ్రీనివాసు తండ్రి : కృష్ణ అను డిఫెండెంట్ చనిపోయినారు. కావున ఐ.ఎ. నెం. 64/2022 గా డిఫెండెంట్ భార్యగారు అయిన చలుమూరి సరస్వతి భర్త (లేటు) శ్రీనివాసును ఈ దావాలో సెకండ్ (ఆర్2) రెస్పాండెంట్ / డిఫెండెంట్ గా చేర్చడమైనది. సదరు ఐ.ఎ. నెం. 64/22లో శ్రీయుత కోర్టువారి ద్వారా రెస్పాండెంట్-2 అయిన చలుమూరి సరస్వతికి శ్రీయుత కోర్టువారి ద్వారా పలుమార్లు ఐ.ఎ. నెం. 64/22 సమన్లు జారీ చేసినచో మీరు తీసుకోని యెడల శ్రీయుత కోర్టువారి ద్వారా పేపరు పబ్లికేషన్ / సబ్‌స్టిట్యూట్ సర్వీస్ ద్వారా మీకు తెలియజేయడమైనది. తెలియపరచడమేమనగా శ్రీ కోర్టువారు పై దావా నందు 19-10-2023 తేదీన పై కోర్టువారి యెదుట హాజరై మీకు గల ఆక్షేపణలను మీరుగాని మీ తరఫున న్యాయవాది గాని ఉదయం 10-30 గం.లకు శ్రీయుత కోర్టువారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలను తెలుపుకొనగలరు. లేనియెడల మీకు పరోక్షముగా తీర్మానించబడునని ఇందుమూలంగా మీకు తెలియజేయడమైనది. శ్రీయుత కోర్టువారి ద్వారా ఈ పేపరు పబ్లికేషన్స్ వేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులు)

నరసరావుపేట
ది.19-10-2023

P.CHAKRAPANI, B.Com, LL.B.,
Advocate,
Station Road, Narasaraopet.
Cell : 9885644203